

# విధి వైపరీత్యం

—భమిడిపాటి శకుంతలాదేవి

"ఏమిటి, లతా? నీ మనస్సులో ఉద్దేశం చెప్పడానికి సిగ్గుపడతావేం?" ఆమె సిగ్గు పోగొట్టడానికన్నట్టు ఆమె చేతిని మృదువుగా నొక్కేడు.

"మీరు ఎప్పుడూ నా దగ్గిరే ఉండాలని... అంతకంటె ఇంకేం లేదు. కాని... అది అసాధ్యమని తెలుసు. మీరు డాక్టర్. మీ కర్తవ్య నిర్వహణకి అడ్డురావడం డాక్టర్ భార్యగా నాకు ధర్మంకాదు..."

"లతా! సాధ్యమయినంతవరకు నాకూ నీతోనే గడపాలని ఉంటుంది. కాని నా వృత్తిధర్మం అలాంటిది. ఏం చెయ్యను, చెప్పు! బాధపడకు, లతా! ఇకనెప్పుడూ ఆలస్యంగా రానుగా!" లత చుబుకాన్ని పట్టుకొని ఆమె కళ్లలోకి చూస్తూ అన్నాడు.

"అబ్బా!" అంటూ లత భాస్కర్ ఒడిలో వాలిపోయింది బాధగా!

"ఏమయింది, లతా!" గాభరాపడుతూ తను లేచి ఆమెను సోఫాలో పడుక్కోబెట్టేడు.

లత ఏం మాట్లాడకుండా బాధతో మెలికలు తిరిగిపోతోంది.

"లతా! ఎందు కంత బాధపడుతున్నావు? చెప్పు, లతా! నీ బాధని చేత్తో తీసి పారేస్తాను." బ్రతిమాలుతూ అడిగేడు.

"అబ్బ! గుండెల్లో నొప్పి! పో

ఆగిపోతుందేమో? ఆయాసంగా ఉంది.'' నీరసించిపోతూ వాలిపోతున్న కను రెప్పలని బలవంతంగా ఎత్తుతూ చెప్పింది.

''గుండెల్లో నొప్పా? ఇంతకుముందు... అదే. . . మన మేరేజ్‌కి ముందు ఎప్పుడైనా వచ్చిందా, లతా?'' అను మానంగా అడిగేడు.

లతకి మాట్లాడే శక్తి లేదు. తొందరగా ఇంజెక్షన్ చెయ్యాలి. అబ్బ...! ఏమిటి ...? ఎప్పుడూ లేనిది చేతులు వణుకుతున్నాయి?

ప్రఖ్యాత సర్జన్ విజయభాస్కర్ కళ్లలో నీళ్లు తిరుగుతుండగా సిరింజ్ అందుకున్నాడు. ఆదరాబాదరాగా ఇంజె క్షన్ ఇచ్చి కార్డియాలజిస్టుకి ఫోనుచేసి, ఏం చేయాలో తోచక, ఆమె బాధను



చూడలేక భగవంతుడిని ప్రార్థించ సాగేడు.

ఎంత శక్తివంతులైనా, ఎంత ప్రతిభాసంపన్నులైనా వారికి తమ వస్తు వను రక్షించుకొనే ఆత్రతలో ఏం చెయ్యలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఆ స్థితిలో భగవంతుడే శరణ్యం. పేషెం ట్సుకి, వారి బంధువులకి డాక్టరే భగ వంతుడు. అతనికి పేషెంటుని అప్ప గించిన తరవాత 'అతనిదే భారమంతా!' అనుకొని నిశ్చింతగా ఉండగలుగుతారు. ఆ క్షణంలో డాక్టర్ కూడా మానవ మాత్రుడే అన్న సంగతి మరిచిపోతారు. డాక్టర్ మానవాతీతుడేం కాదు. తన కప్పగించిన బాధ్యత నెరవేర్చడానికి శాయశక్తులా ప్రయత్నించి చివరికి భగవంతుడిపైనే భారం వేస్తాడు. మానవులు చేయలేని పనిని భగవంతుడు చేయగలడనే ఆశ తప్పితే భగవంతుడు కూడా ఏం చేయలేడు. అతను మానవుల కన్నా అసమర్థుడు. మానవులు ఏదో చికిత్స చెయ్యడానికి ప్రయత్ని స్తారు. కాని భగవంతుడికి జరగబోయే దంతా ఎప్పటికప్పుడు తెలుస్తూనే ఉంటుంది. కాబట్టి ఏం చేయలేక జరగబోయే కర్మకాండకి సాక్షిభూతంగా మాత్రమే నిలుస్తాడు. నిజానికి తన సృష్టిని తనే నాశనం చేసుకోవాలంటే అతడికి కూడా బాధగానే ఉంటుందేమో ఎవరికి తెలుసు?

విజయభాస్కర్ ప్రఖ్యాత సర్జన్ అని పేరు గాంచినా, ఎందరి ప్రాణాలనో రక్షించగలిగినా ప్రస్తుతం ఏం చేయలేని అసహాయుడు. కన్నీళ్లు జలజలా రాలి పోతుంటే మోకాళ్ల మీద కూర్చుని, ''మాట్లాడు, లతా!'' అంటూ పిచ్చిగా పలవరిస్తున్నాడు. దూరంగా ఎక్కడో తీతువు అరుచుకుంటూ వెళ్లిపోయింది.

నెమ్మదిగా కళ్లు తెరిచింది లత. పద్మం విచ్చుకున్నట్టు ఉంది. ''ఎలా ఉంది, లతా? !'' ఆత్రంగా ప్రశ్నించేడు భాస్కర్.

బాధగా నవ్వింది లత. ''మీరు నాకోసం విచారిస్తున్నారా? వద్దు! మీరు బాధపడకండి ... నాకు తెలుసు, ఈ నొప్పి తగ్గదని... భగవంతుడు పిలుస్తున్నా ... మీతో ... కొన్ని మాటలు చెప్పాలని ఆయనను ప్రార్థించి కొన్ని క్షణాలు అనుమతి తీసుకున్నాను...'' ఒక్క క్షణం ఆగింది.

''నేను ... నేను ... చాలా అదృష్ట వంతురాలిని. మీ వంటి ఉత్తమ వ్యక్తికి భార్యగా కొన్ని సంవత్సరములైనా గడపగలిగిన నేను ధన్యురాలిని...

మీదైన ఈ లత ఎప్పటికీ మీదే! ఎక్కడున్నా మీదే ...! నా శరీరం మట్టిలో కలిసిపోయినా నా ఆత్మ మీ దగ్గిరే ఉంటుంది...''

''వద్దు ... లతా! అలా అనకు. నాకు నువ్వే కావాలి. నా ప్రాణా లర్పించయినా నిన్ను బ్రతికించుకుంటాను.'' దృఢంగా అన్నాడు భాస్కర్.

చిలిపిగా నవ్వింది లత అంత బాధ లోనూ. ''ఒక్క విషయం చెప్పనా? మీరు రాలేదని అలిగి మిమ్మల్ని బాధ పెట్టే లత లేకపోతే ... మీరు ... మీ పేషెంట్సుతో ...''

''లతా!'' గది అంతా దద్దరిల్లి పోయింది. ''ఏమిటి ...? ఏమిటి, లతా, నువ్వంటున్నది? నా కీర్తి కండూతికోసం నా లత ప్రాణాలు కోరే నీచుణ్ణను కున్నావా? ఇంతేనా, లతా, నువ్వు నన్ను అర్థంచేసుకున్నది ...?'' దుఃఖంతో కంపించిపోయేడు.

గుండెలు చేత్తో పట్టుకొని బాధ అణుచుకుంటూ భాస్కర్ కన్నీళ్లు తుడిచింది లత. ''నన్ను క్షమించండి. మీరు అంత బాధపడతా రనుకోలేదు. నా ఆఖరి ఘడియలు సమీపించేయని నాకు తెలుసు. నా చివరి కోరిక తీరు స్తారా?'' రాబోయే కన్నీటి ప్రవా హాన్ని ఆపుకుంటూ వణుకుతున్న చేతిని చాపింది లత.

కింద కాలింగ్‌బెల్ మోగింది. పరు గున వెళ్లి తలుపు తెరిచేడు భాస్కర్.

''చూడరా, ప్రభా! నా లత ... నా లత...'' ఏడ్చేసేడు భాస్కర్.

''ఏం జరిగింది, భాస్కర్? ఏమిటి? డాక్టరువయి కూడా ఏమిటీ బేలతనం?... పద, చూద్దాం!'' ముందుకి కదిలి పోయేడు ప్రభాకర్.

అప్పటికే వాలిపోయిన కళ్లతో, పాలి పోయిన ముఖంతో మృత్యువుతో పోరాడుతున్నట్టు ఉంది లత. ప్రభాకర్ నల్పు చూసి హార్టు కండిషన్ పరిశీ లించడంలో మునిగిపోయేడు.

''ఎలా ఉంది, ప్రభా! నా లతని నాకు దక్కించు.'' ప్రభాకర్ చేతులు పట్టు కొని దీనంగా అర్థించేడు ప్రఖ్యాత సర్జన్ విజయభాస్కర్. ''చూడు, భాస్కర్! నువ్వు ఇలా కంగారుపడకూడదు. కరొనరీ థ్రాంబోసిస్ అనుకుంటున్నాను. నేను చేయగలిగిందంతా చేస్తాను.''

''నిజంగానా?'' నిలబడలేక అక్కడే కూర్చుండిపోయేడు. 'తను సర్జన్ కాకుండా కార్డియాలజిస్టు అయి ఉంటే ...! తను లతని తప్పి కించుకో గలిగేవాడేమో?' సర్జరీ ... ఎందుకు తనని తనే తిట్టుకోసాగేడు పిచ్చి భాస్కర్. విధివ్రాత మార్చడం ఎవరి తరం కాదని ఆ క్షణంలో మరిచి పోతారు మానవు లెందుకో?

ప్రభాకర్ ఇచ్చిన ఓజాక్షన్ ఫలితంగా లత కళ్లు తెరిచింది. ''ఒక్క క్షణం మీతో ఏకాంతంగా ...'' వాలిపోతున్న కళ్లను బలవంతంగా తెరిచి ఉంచుతూ భాస్కర్ వైపు చూసింది. అర్థం చేసుకున్న ప్రభాకర్ భగవంతుడిమీద భారంవేసి అక్కడినుంచి వెళ్లిపోయేడు.

''మీరు నా గురించి బాధపడి ఆరోగ్యం పాడుచేసుకోవని ఈ చివరి క్షణంలో మాట ఇవ్వండి. తుది వీడ్కోలు తీసుకుంటున్న ఈ క్షణంలో... నాకు ప్రియాతిప్రియమైన మీ చిరు నవ్వుని చూసే భాగ్యం ... కలిగించండి. ఏదీ...ఒక్కసారి ... నాకోసం...నవ్వరూ.''

''లతా! నన్ను నవ్వమంటున్నావా? ఎందుకు, లతా, ఇలా చిత్రవధ చేస్తావు?'' భోరున ఏడ్చేడు విజయ్ తనని తనే మరిచిపోయి.

ఆ సమయంలో పేషెంట్సుకి ధైర్యం చెపుతూ, మెడిసిన్సుతోపాటు అమృతం వంటి మాటలతో మరిపింపజేసి అతి చాకచక్యంతో ఆపరేషన్ చేయగలిగే సర్జన్ విజయ భాస్కర్ కాడు అతను.

తను ఆలస్యంగా వస్తే అలిగి కూర్చున్న ప్రేయురాలి కోపాన్ని తన అందమైన చిరునవ్వుతో పోగొట్టి, మంత్రంవేసి వశ్యే ఆమె అలక తీర్చగలిగిన అందాల విజయ భాస్కర్ కాడు అతడు—సామాన్య మానవుడు. చివరి క్షణాల్లో ఉన్న తన భార్య ప్రాణ రక్షణకై కోటి దేవతలకి మ్రొక్కే అతి సామాన్య మానవుడు.

"నేను చేసుకున్న పుణ్యం ఇంతే. నన్ను మరిచిపోరు కదూ!" వెచ్చటి కన్నీరు ఆమె పాలబుగ్గల మీదుగా జారిపోయింది.

"నేను చెప్పిన మాట వింటారా?" అతని చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అడిగింది.

"చెప్పు, లతా! నువ్వు చెప్పేది ఏదయినా సరే, నాకు శక్తికి మించిన దయినా సరే తప్పక నీ కోరిక తీరుస్తాను." దృఢంగా అన్నాడు.

"మీరు ... మీరు ... అనుపమని పెళ్ళిచేసుకుని ..." ఆమె కంఠం వణికింది.

"లతా! లతా! ఎందుకు, లతా, నాకీ కఠిన శిక్ష?" బాధగా తల కొట్టుకున్నాడు.

"మీరు ఆవేశపడకండి. అనుపమ మిమ్మల్ని ఎంతగానో ప్రేమించేరు. తను ప్రేమించిన వాళ్లతో కంటే, తనని ప్రేమించిన వాళ్లతోనే సుఖపడతారట...! ఆమె శాపమే నాకు తగిలింది." ఆయాసంతో ఆగిపోయింది.

"నిన్ను శపించిన అనుపమని నేను పెళ్లిచేసుకోవడమా? అసంభవం!"

చిన్నగా నవ్వింది లత. "నాకు మాట ఇచ్చేరు. నాకు ప్రియాతిప్రియమైన మీరు మాట తప్పరని, నా అంతిమ కోరిక తప్పక ... తీరుస్తారని ... నాకు తెలుసు. మరి ... నాకు ... నాకు ... సెల ...!" మాట్లాడుతున్న లత కంఠం ఆగిపోయింది.

"లతా! మాట్లాడు, లతా!" బిగ్గరగా అరుస్తున్నాడు విజయ భాస్కర్. పరుగున వచ్చేడు ప్రభాకర్. చివరి ప్రయత్నంగా కార్డియాల్ మసేజ్ చేసేడు.

"ప్రభా! నా లత ... నాకు ... ఇక లేదా? ప్రభా!"

మాట్లాడలేని ప్రభాకర్ మృదువుగా అతని చెయ్యి నొక్కేడు. "వియామ్ ఎక్స్ట్రీమ్లీ సారీ, భాస్కర్! ఇంత చిన్న వయస్సులో కరొనరీ ఎటాక్ చాలా రేర్. నువ్వు అధైర్యపడకు, భాస్కర్. నీ విచారం మాటలతో పోయేదికాదని నాకు తెలుసు." స్నేహితుని బాధ చూడలేక అతని కళ్ళు కూడా వర్షించేయి. దేవతలాంటి లతని చివరిసారిగా దర్శించడం కోసమా అన్నట్టు ఉదయభాస్కరుడు కిటికీ లోంచి తొంగిచూస్తున్నాడు.

'తమకి భగవంతుని పాదస్పర్శ భాగ్యం కలగజేసే తమ స్నేహితురాలు ఇంకా రాలేదేమా?' అని తోటలో మల్లెలు తమ మీది తుషారబిందువులు సూర్య కాంతిలో మెరవగా స్నేహలత కోసం నిరీక్షిస్తున్నాయి. దీపారాధన చేసి మల్లెలతో పాటు వెన్నని ఫలహారంగా అందించే లతకోసం వేణువుని సవరించి ఎదురు చూస్తున్నాడు మందిరంలోని వేణుగోపాలుడు. అందరినీ నిరాశపరిచి, ఎవరి దగ్గిరా చివరి వీడ్కోలైనా తీసుకోకుండా ఏ లోకంలో ఎవరి ఆహ్వానం అందుకుందో ఏమో దేవతలాంటి స్నేహలత ఈ లోకాన్ని, తనకి ప్రియాతి ప్రియమైన వ్యక్తుల్ని, పరిసరాలని విడిచి శాశ్వతంగా వెళ్లిపోయింది!

దేవేంద్ర భవనం వంటి 'స్నేహాలయం' స్నేహలత నిష్క్రమణతో చిన్నబోయింది. అందాల లత లేదనుకుంటేనే హృదయం కరిగి నీరైపోతుంది. భగవంతుని వరంగా భావించేడు లతని విజయభాస్కర్. అందానికి మారు పేరైన భాస్కర్ చిక్కి శల్యమయి పోయేడు. కంటిచుట్టూ నల్లని గీత లేర్పడ్డాయి. "నామీద అలిగి పోయేవా, లతా! ఎందు కింత శిక్ష విధించేవు? నీ భాస్కర్ మీదనే నీ కెందు కింత నిర్దయ?" కదిలి కదిలి ఏడ్చేడు. ఎవరి ఓదార్పూ అతన్ని శాంతపరచలేక పోయింది. లత చివరి కోరిక అతన్ని మరీ బాధించింది. అనుపమ! తను చదువుకునే రోజులు గుర్తు వచ్చేయి భాస్కర్కి.

తను అప్పుడే క్రొత్తగా థర్డియర్ పాసయి క్లినికల్ సైడు వచ్చేడు. పెద్ద అన్నయ్య శ్రీకాంత్ సర్జన్. అన్నయ్య ఆపరేషన్స్ గురించి చెబుతూంటే తను ఈ లోకాన్నే మరిచిపోయి శ్రద్ధగా వినేవాడు. సర్జరీ అంటే తనికి చాలా అభిమానం. సర్జన్ అంటే ఒక విధమైన ఆరాధన. తనకి మొదట సర్జికల్ వార్డు పోస్టింగ్స్. ఛీఫ్ చెబుతూంటే ఆరాధనాభావంతో వింటూ ఉండేవాడు. ఆయనెప్పుడూ చెప్పేవారు సర్జరీ అంటే అందరి అభిప్రాయం కోసి పారెయ్యడం అని, కాని అది శుద్ధతప్పు అని. కోసి పారెయ్యడంలో గొప్పేం లేదు. ఆపరేషన్ చెయ్యడం తేలికే కాని ... ప్రీ ఆపరేటివ్ ప్రిపరేషన్స్, పోస్టు ఆపరేటివ్ ట్రీట్మెంటు చాలా కష్టమనీ సర్జన్ యొక్క బరువు బాధ్యతల గురించి చెబుతూంటే కళ్లు చెమ్మగిల్లేవి. ఎప్పటికైనా తను గొప్ప సర్జన్ కావాలని నిశ్చయించుకున్నాడు అప్పుడే.

ఆ రోజు ఛీఫ్ చేసిన ఆపరేషన్ని మననం చేసుకుంటూ వస్తూంటే దారిలో క్రింద పడిపోయిన పుస్తకాలని ఏరుకుంటూ ఒక అమ్మాయి ఏడుపుని దిగమ్రింగుతూ కళ్లు తుడుచుకుంటూంది. ఆ అమ్మాయిని చూస్తే జాలేసింది. "ఎవరు, పాపా, నువ్వు?" ప్రశ్నించేడు తను.

ఆ అమ్మాయి కంటికి తను ఆప్తుడులా కనిపించాడేమో కళ్లు తుడుచుకుంటూ చెప్పింది. "నా పేరు అనుపమ. మెడికల్ కాలేజీలో ఇప్పుడే జాయినయ్యేనండీ. మా నాన్నగారు నన్ను హాస్టల్లో విడిచి వెళ్లిపోయేరు." బాధగా కళ్ళు తుడుచుకుంది.

"మరి పుస్తకాలు క్రింద పడేసుకున్నావేం?"

"ఏడుస్తూ వస్తూంటే రాయి తగిలి పడిపోయేనండీ!" అమాయికంగా చెప్పింది.

"ఛ! ఎవరైనా ఏడుస్తారా? మేమంతా నీలాగే వచ్చేం. శ్రద్ధగా చదువుకోవాలి గాని ఏడవకూడదు. తప్పుకదూ?" చనువుగా మందలించేడు. ఆ అమ్మాయి సిగ్గుగా కళ్ళు తుడుచుకుంది.

"ఇంకెప్పుడూ ఏడవకేం?" అన్నాడు.

"ఏడవనండీ!" కన్నీటితో తళతళ మెరిసే ఆ కళ్లని చూస్తే నీటిలో చేప పిల్లలు గుర్తు వచ్చేయి తనకి. చిరునవ్వుతో వెళ్లిపోయేడు తను. ఆ తరవాత తను చాలా రోజులవరకూ అనుపమని చూడలేదు. ఫార్మకాలజీ పాసయి ఫిఫ్తు ఇయర్లోకి వచ్చేడు. త్వరత్వరగా వెళ్లిపోతున్న తను "విజయ భాస్కర్ గారూ!" అని ఎవరో పిలిస్తే వెనక్కి తిరిగి చూసేడు. ఎవరో అమ్మాయి చేతిలో పుస్తకాలతో తన వైపే చూస్తూంది. 'ఆ అమ్మాయా తనని పిలిచింది? ఛ! అమ్మాయిలు తన నెందుకు పిలుస్తారు?' ఆశ్చర్యపడినా అక్కడే ఆగిపోయేడు.

కదిలే రాజహంసలా ఆమె నడిచి వచ్చి తన దగ్గిరే ఆగిపోయింది.

"నన్ను మరిచిపోయేరా?" అంది.

అప్పటికి గుర్తు వచ్చింది తనకి ఆ అమ్మాయి అనుపమ అని. 'తన పేరు ఈమె కెలా తెలిసిందా?' అని ఆశ్చర్యపోయేడు. అయినా సభ్యతకోసం "లేదు, మిమ్మల్ని మరిచిపోలేదు. మీరు అనుపమాదేవి కదూ!" అన్నాడు తను.

"థాంక్స్! నేను చాలా అదృష్టవంతురాలిని, మీకు నేను గుర్తున్నానంటే."

తనకి ఆశ్చర్యంవేసింది. 'ఆ రోజు తండ్రి వెళ్లిపోయేరని ఒంటరిగా రోడ్డు మీద నిలబడి బేలలా దుఃఖించిన అనుపమేనా ఇంత గలగలా మాట్లాడుతూంది?' అనుకున్నాడు.

"ఏమిటి, ఆలోచిస్తున్నారు?" ఆమె చనువుగా అడిగింది.

"అహఁ! ఏం లేదు!" తను తప్పించుకోబోయేడు.

"అదేంకాదు. ఈ అమ్మాయికి ఇంత ధైర్యం ఏమిటి అనుకుంటున్నారేం? అన్నట్టు నేను ఫస్టు ఇయర్ పాసయేను" అంది.

"కంగ్రాచ్యులేషన్స్." అప్రయత్నంగానే అన్నాడు తను.

"మీరు చాలా బాగా చదువుతారట కదూ?" అంది.

పిడుగులాంటి ప్రశ్న విన్నట్టు అదిరిపడ్డాడు తను. "ఎవరు చెప్పేరు మీకు?" ఆశ్చర్యంగా ప్రశ్నించేడు తను. ఆ అమ్మాయి చెప్పకుండా టాపిక్ మార్చేసింది.

"మిమ్మల్ని ఎన్నోసార్లు కలుసుకోవాలనుకున్నాను. నాకు ధైర్యం చెప్పినప్పటి మీ రూపే ఎప్పుడూ నా కళ్లముందు..." అంటూ ఆగిపోయింది, తన కళ్లల్లో చిత్రంగా మెదిలిన భావాల్ని చూసి.

"క్షమించండి, ఏమేమో మాట్లాడేస్తున్నాను," క్షణం ఆగింది ఎటో చూస్తూ.

"ఈ రోజు నా బర్త్డే. మీరు కనిపించడం నా అదృష్టం. నా బర్త్డే పార్టీకి రారూ?" దీనంగా అర్థించింది.

ఆ అమ్మాయి చనువుకి ఒక విధమైన ... అదేమిటో చెప్పలేని భావం కలిగింది.

అనుపమకి హృదయ భావాలు చదవగలిగే శక్తి ఉందేమో బహుశా?

"నన్ను మన్నించమని మిమ్మల్ని ముందే వేడుకున్నాను. మొదటి పరిచయంలోనే ఇంత చనువుగా ... అందులో అమ్మాయి అయి ఉండీ ఎవరైనా ఇలా మాట్లాడుతారా అనుకుంటున్నారు.